సరుకులు, నగదు వితరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:అరకు నియోజకర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొములు నాయుడు తన ఉదారతను చాటుకున్నారు. గుంటగన్నెల పంచాయతీ లక్క గ్రామానికి చెందిన కిల్లో భగవాన్ భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో పెద్దకర్మ సందర్భంగా ఆయన బాధిత గిరిజనుడి స్వగ్రామానికి చేరుకుని 50 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, నగదును అందజేశారు ఈ కార్యక్రమంలో కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు అర్జున్, పెసా కమిటీ సభ్యులు గాసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న నాయకులు

రెండో రోజూ 'శ్రామికోత్సాహం'

▶▶ అలరించిన సాంస్కృతిక, కళా, నృత్య ప్రదర్శనలు
▶▶ ఆకట్టుకున్న సైన్స్, కార్టూన్ ఎగ్జిబిషన్‌లు, షార్ట్ ఫిలిం షోలు

కళా రూపం ప్రదర్శిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

ప్రజాశక్తి -గ్రేటర్‌విశాఖబ్యూరో:సిఐటియు 18 అఖిల భారత మహాసభలు సందర్భంగా నిర్వహిస్తున్న శ్రామక ఉత్సవ్‌లో భాగంగా రెండో రోజు ఆదివారం విశాఖ సాగర తీరం ఏయూ కన్వెన్సన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వీక్షకుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. అత్యధిక సంఖ్యలో ఇక్కడి ఎగ్జిబిషన్ స్టాల్స్ వద్ద ప్రజలు గుమిగూడి తిలకించారు. ప్రజానాట్య మండలి కళాకారుల బృంద గానాలు, కళాకారుల సోలో పాటలు ఆద్యంతం వీక్షకులందరినీ ఉర్రూతలూగించాయి. చిన్న పిల్లలు సైతం 'శ్రామిక ఉత్సవ్' వేదికపై జరిగిన డాన్సులకు హావభావాలతో ఆనందిస్తూ కేరింతలు కొట్టడం, కోలాటం కర్రలతో నృత్యం చేయడం అందరినీ కట్టిపడేశాయి.

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకూ ఇక్కడి కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న సిఐటియూ ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా శనివారం (27న) ప్రారంభమైన 'శ్రామిక ఉత్సవ్' రెండో రోజు 'ఆనందమానంద మాయె' అన్నట్టుగా సాగింది. జానపద కళా నృత్యాలు, గిరిజన డప్పులు, డాన్సులు, వేమన పద్యాలతో కళారూపాలు అన్నీ అలరించాయి. ఆదివారం శ్రామిక్ ఉత్సవ్‌లో ప్రధాన ఆకర్షణగా కవులు, రచయితల కవితల పఠనం, సమ్మేళనం సభ ఆద్యంతం విజ్ఞాన దాయకంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాహితీ స్రవంతి నిర్వహణలో సాగిన 'శ్రామిక కవనం'లో 100 మంది వరకూ కవులు పాల్గొని వివిధమైన సమస్యలపై కవితాగానం చేశారు. ఈ సందర్భంగా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సుమారు 15 వేల రకాల, 100 మంది రచయితలు రాసిన లక్ష వరకూ పుస్తకాల వద్దకు పెద్ద సంఖ్యలో జనం విచ్చేసి తిలకించారు. పలువురు తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు.

రాష్ట్రంలో కార్మిక శక్తికి విశాఖే కేంద్రం

-సమస్య ఏదైనా సానుకూలంగా స్పందిస్తాం
-కార్మిక కష్టాలు తీర్చడంలో సిఐటియు ప్రత్యేక కృషి
-శ్రామిక ఉత్సవ్‌లో విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్

మాట్లాడుతున్న తేజ్ భరత్, వేదికపై సిహెచ్.నర్సింగరావు తదితరులు

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో:కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు అత్యధికంగా గల కేంద్రం విశాఖ అని, ఇది కార్మిక శక్తికి కేంద్రమని విఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్ భరత్ అన్నారు. 'కార్మిక కర్షక ఐక్యత వర్ధిల్లాలి అనే థీమ్‌తో విశాఖ ఏయూ కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆదివారం రెండోరోజు శ్రామిక ఉత్సవ్ సభ ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన తేజ్ భరత్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలు తీర్చడంలో సీఐటీయూ ప్రత్యేక కృషి చేస్తుందని కొనియాడారు. ఇక్కడ కార్మిక సమస్యలు, ఇంకా ఏమైనా అభివృద్ధికి సంబందించిన సమస్యలపై తాము సానుకూలంగా స్పందిస్తామని కమిషనర్ తెలిపారు. విశాఖకు రాబోతున్న రూ.వందలకోట్ల పెట్టుబడులతో ప్రభుత్వం అనేక రోడ్ల అభివృద్ధి ప్రాజెక్టలకు శ్రీకారం చుడుతుందన్నారు. వైజాగ్ సిటీని అడ్వంచెర్ హబ్‌గా మార్చే కృషి చేస్తున్నామని చెప్పారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజల కోసం విఎంఆర్‌డిఏ ఇళ్ల నిర్మాణానికి ప్లాన్ చేస్తుందన్నారు. వైజాగ్‌లో 50 మురికి వాడాలున్నాయని, వీటి రీ డెవలప్మెంట్ కోసం ప్లాన్ చేస్తున్నామని చెప్పారు.

కార్మికు హక్కులపై నానాటికీ దాడులు : గఫూర్

దేశంలోనూ, రాష్ట్రంలోనూ కార్మిక హక్కులపైనా, కార్మికులపైనా నానాటికీ ప్రభుత్వాలు దాడులు చేస్తున్నాయని పోరాడి సాధించుకున్న చట్టాలను 4 లేబర్ కోడ్‌లతో ధ్వంసం చెయ్యాలని చూసే చర్యలపై నిరంతరం పోరాడాలని సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. 'శ్రామిక ఉత్సవ్' రెండోరోజు 'కార్మిక, కర్షక ఐక్యతే లక్ష్యం' అనే థీమ్ (స్పిరిట్ ఆఫ్ వర్కింగ్ క్లాస్)తో జరుగుతున్న సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వావలంబనను నిలబెట్టేందుకు సిఐటియూ 1970 నుంచి కృషి చేస్తుందని చెప్పారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న జాతీయ మహాసభల్లో ఈ అంశంపై సిఐటియూ ప్రతినిధులు చర్చించనున్నారన్నారు. రైతు సంఘం ఆలిండియా నాయకులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ దేశంలో కార్మికవర్గానికి సంకెళ్లు వేసే లేబర్ కోడ్‌లను మోడీ ప్రభుత్వం తెచ్చిందని, దేశానికి తిండిపెట్టే రైతన్నలను హింసలకు గురిచేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఇలాంటి విధానాలను తిప్పికొట్టాలని ఢిల్లీ, పంజాబ్, హర్యానా రైతుల ఆందోళనలు మోడీ మెడలు వంచిన తీరును వివరించారు. కేంద్రం కోటి ఎకరాలు, ఏపి ప్రభుత్వం 14లక్షల ఎకరాల సాగుభూమిని సేకరించాలనే లక్ష్యంతో గ్రామాల్లో భూములను లాక్కొని గ్రామ సంస్కృతిని దెబ్బతీసే చర్యలకు దిగడాన్ని ఎదిరించాలని పిలుపునిచ్చారు. శ్రామిక మహిళ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా నాయకులు పి.మణి మాట్లాడుతూ ప్రభుత్వ రంగానికి నిలయమైన విశాఖలో ఆ పరిశ్రమలు లేకుండా, పేదలకు హక్కుగా ఉండే భూములను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు అల్లూరి నరసింహరాజు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎ ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో నిలిచిపోయిన వాహనాలు

అరకులోయలో అవస్థలు..

▶▶ భారీగా తరలివచ్చిన పర్యాటకులు ▶▶ రద్దీగా రహదారులు
▶▶ ఎక్కడికక్కడ నిలిచిన వాహనాలు ▶▶ గంటలతరబడి సతమతం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:గత వారం రోజు లుగా అరకులోయలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో, ప్రయాణికులు, పర్యాటకులు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం సెలవు, పర్యాటక సీజన్ నేపథ్యంలో భారీగా పర్యాటకులు తండోపతండాలుగా అరకులోయకు చేరుకుంటుండటంతో రోడ్లన్నీ వాహనాలతో నిండి పోయాయి. ప్రధాన రహదారులు మాత్రమే కాకుండా అంతర్గత రోడ్లపై కూడా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచి పోవడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభిస్తోంది. వాహనాలు గంటల తరబడి ముందుకు కదలక పోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ముఖ్యంగా బస్సులు, కార్లు, టూరిస్ట్ వాహనాలు ఒకేసారి రావడంతో, అడ్డదిడ్డంగా, ఎక్కడికక్కడే వాహనాలు ఆపుతుండడంతో ట్రాఫిక్ జామ్ మరింత తీవ్రమవుతోంది. ఇక రోడ్లకు ఇరువైపులా నిర్మించిన ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో పాదచారులు నడవడానికి కూడా సరైన స్థలం లేకుండా పోయింది. ట్రాఫిక్ నియంత్రణకు సరైన చర్యలు తీసుకోకపోవడం, పార్కింగ్ సదుపాయాలు లేకపోవడం కూడా సమస్యను మరింత పెంచుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.ట్రాఫిక్ పోలీసులు సంఖ్య తక్కువగా ఉండడంతో రద్దీని నియంత్రించడం సాధ్యం కాలేదని వారు చెబుతున్నారు.

పర్యాటక ప్రాంతమైన అరకులోయలో ఇలాంటి పరిస్థితులు కొనసాగితే పర్యాటకుల భద్రతకే కాకుండా స్థానికుల జీవన విధానంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని, ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని, ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి- రావికమతం: మండల కేంద్రంలో పలు దుకాణాలపై కొలతలు, తూనికలు శాఖ అధికారులు ఆదివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మాంసం, చేపలు కాయగూరలు అమ్ముతున్న దుకాణాలలో కిలోకు 330 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించి ఐదుగురు వ్యాపారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని అనకాపల్లి కొలతలు, తూనికలశాఖ ఇన్స్పెక్టర్ వి.రామారావు తెలిపారు. అదేవిధంగా ముద్రలేని తూనిక యంత్రాలను ఉపయోగిస్తున్న మరో నలుగురు దుకాణ యజమానుల పై కేసులు నమోదు చేసామని పేర్కొన్నారు. తూనికల్లో తేడాలు ఉన్నట్లు ప్రజలు గమనించినట్లయితే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి తమను సంప్రదించవచ్చని అన్నారు. తూనికలు, కొలతలలో తేడాలు వస్తే అటువంటి వ్యాపారుల పైన చట్టరీత్య కఠినమైన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు. వ్యాపారులు ప్రజలను మోసాలకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

మంజూరు కాని పూర్తిస్థాయి నిధులు
మధ్యలో నిలిచిపోయిన పనులు
తాత్కాలికంగా పంచాయతీ కార్యాలయంలో నిర్వహణ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ గుమ్మిరేవుల గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పది లక్షలు పదేళ్ల క్రితం మంజూరు చేసింది. నిర్మాణ పనులు కాంట్రాక్టర్ మాణిక్యంకి అప్పగించారు. అప్పట్లో పనులు ప్రారంభించి ద్వారబందాలు వరకూ నిర్మాణ పనులు చేపట్టారు. కొంత నగదు మొదటి విడతగా మంజూరు చేశారు. మిగిలిన సొమ్ము చెల్లించకపోవడంతో పదేళ్లుగా సదరు కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడు. పనులు పూర్తిగా కాకపోవడంతో భవనం వినియోగంలోకి రాలేదు. అప్పటినుంచి ప్రీస్కూల్ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. గుమ్మరేవుల సర్పంచ్ మురళి కమలమ్మ చొరవ చూసి పంచాయతీ కార్యాలయంలో ప్రీస్కూల్ పిల్లల నిర్వహణకు అవకాశం కల్పించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ పంచాయతీ కార్యాలయంలోనే ఆటపాటలు నేర్పుతూ వారికి మధ్యాహ్న భోజనాలు సమకూరుస్తున్నారు. శాశ్వత భవనం లేకపోవడంతో ప్రీ స్కూలు పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. పలుమార్లు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒకి మొర పెట్టుకున్నా భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్ పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్లేదు. ఇటీవల అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఐదు లక్షలు మంజూరు చేసింది. ఈ సొమ్ముతో పనులు పూర్తికావని కాంట్రాక్టర్ పనులు చేపట్టడానికి నిరాకరించాడు. మరొక మూడు లక్షలు మంజూరు చేస్తే పనులు చేస్తానని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి

అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు తక్షణమే పూర్తి చేయాలి. శాశ్వత భవనం లేక పిల్లలు, సిబ్బంది అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఎపిఒ చొరవ చూపాలి.

- మురళి కమలమ్మ, సర్పంచ్, గుమ్మిరేవులు

పంచాయతీ కార్యాలయంలో పిల్లలకు భోజనాలు పెడుతున్న దృశ్యం

పునరావాస కాలనీ పూర్తయ్యేనా..?

పూర్తి కాని ఇళ్ల నిర్మాణం
త్రిశంకు స్వర్గంలో పోలవరం నిర్వాసితులు...

ప్రజాశక్తి-విఆర్‌పురం : 2019 నుండి పోలవరం హడావుడి ఊపందుకుంది. మొదటిదశలో మొదటి కాంటూరు 41.5లో ఉన్న గ్రామాల వారు 2022లో పరిహారం పొందారు. అంతకు ముందు ఇళ్ళ ప్యాకేజి ఇచ్చి వారికి కాలనీల నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఇప్పటికి ఐదేళ్లు దాటినా కొన్నిచోట్ల నిర్మిస్తున్న కాలనీలు పూర్తవలేదని వివిధ గ్రామాలకు చెందిన పోలవరం నిర్వాసితులు వాపోయారు. ముఖ్యంగా గిరిజనేతరుల కాలనీల విషయానికి వస్తే ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పరిధిలోని తాడ్వాయికాలనీ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తే జూన్ నాటికి తరలి వెళ్ళే వీలుంటుందని ఇక్కడ ప్రతి ఏటా గోదావరి వరదలతో ఇబ్బందులు పడుతున్న దుస్థితి ఉందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇళ్లునిర్మించారు కానీ కొన్ని కాలనీల్లో ఫ్లోరింగ్ పూర్తి కాలేదు. డోర్లు ఏర్పాటు చేయలేదు. తాడ్వాయి కాలనీలో ఇంకా పునాదుల దశలోనే ఇళ్ల నిర్మాణం ఉంది. జూన్ కల్లా పూర్తవుతాయా లేదా ఒక్కసారి ఆలోచించాలని నిర్వాసితులు వాపోతున్నారు. ఇళ్ళ నిర్మాణ పనులు ఇప్పటి నుండి వేగవంతం చేస్తే ఉన్నపెండింగ్ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నా 5 నెలలు పైగా సమయం పడుతుందని గిరిజనేతర నిర్వాసితులు మొరపెట్టుకుంటున్నారు. కనీసం ఇళ్లు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించాలని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పునాదుల దశలో ఉన ఇళ్లు

ఎమ్మెల్సీ అనంతబాబుపై టిడిపి నేతలు ఫిర్యాదు

ఫిర్యాదు ఇస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఎమ్మెల్సీ అనంతబాబుపై రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్‌లో టిడిపి నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శిరీషాదేవి పై, అదేవిధంగా తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్, గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావు, గంగాధర్, కె.శ్రీనివాస రావు, లోవరాజు, మధు, టి.రాంబాబు తదితరులు డిమాండ్ చేశారు. బాధ్యత గల పదవిలో ఉన్న మహిళా ఎమ్మెల్యేను కించపరుస్తూ మాట్లాడడం సరికాదని తరచూ అదే పనిగా దూషిస్తున్నారని ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకువాలని హెచ్చరించారు. అభివృద్ధి మీరు చేశారో మేము చేసామో పబ్లిక్ లో తేల్చుకుందాం రావాలని సవాల్ విసిరారు.

ఈ మేరకు రాజఒమ్మంగి, జడ్డంగి పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు అందజేశారు. పలువురు టిడిపి, జనసేన కూటమి నేతలు పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్సీ అనంత్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తదితరులు తమపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్టు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా రంపచోడవరం రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి.

నగదు అందిస్తున్న విద్యార్థులు

ఉదారత చాటుకున్న స్నేహితులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: లాగరాయి జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అనిల్‌కుమార్ తల్లి ఇటీవల మృతి చెందడంతో తోటి విద్యార్థులు తాము సేకరించిన రూ.5వేలు నగదును అనిల్ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.విద్యార్థి దశ నుంచే ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవర్చుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: డిసెంబరు 31న రాత్రి న్యూ ఇయర్ వేడుకలు ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని రాజ ఒమ్మంగి సిఐ గౌరీశంకర్ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం తాగి వాహనాలు నడపడం, వీధుల్లో డిజె సౌండ్స్, రికార్డింగ్ డ్యాన్సులు ఏర్పాటు చేయడం వంటివి నిషేధిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు నూతన సంవత్సర వేడుకలు ఇళ్ల వద్దే ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకరోజు ముందుగానే పింఛన్ పంపిణీ

ప్రజాశక్తి- వై.రామవరం: మండలంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జనవరి నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్ డిసెంబర్ 31 తేదీన లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి ఒకటో తేదీన నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒకరోజు ముందుగానే పింఛన్ ఇవ్వనుంది, దీనికి సంబంధించిన నగదును బ్యాంకుల నుంచి 30 తేదీన నిర్ణయించిన గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు విత్ డ్రా చేసుకోవాలని ఎంపిడిఒ బాపన్నదొర తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో డిఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ : వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఆదివారం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలు, భద్రత, పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. బుకింగ్ కౌంటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, క్యాటరింగ్ స్టాళ్లు, ప్లాట్‌ఫారమ్‌లపై భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. సిసిటివి మానిటరింగ్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ప్రయాణికుల రద్దీపై సమీక్షలో భాగంగా విశాఖపట్నం -కిరండూల్ మార్గంలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని గమనించిన డీఆర్‌ఎం, తక్షణమే అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైలు నెంబర్ 58501 విశాఖ - కిరండూల్ రైలుకు డిసెంబర్ 29 నుండి జనవరి 20వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో డిసెంబర్ 30 నుండి జనవరి 21 వరకు ఒక అదనపు జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జోడించాలని ఆదేశించారు. పండగ, పర్యాటక సీజన్ దృష్ట్యా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. డీఆర్‌ఎం వెంట ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) కె.రామారావు, ఉన్నతాధికారులు ఉన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

పాడేరులోని వంజంగిలో మంచు అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తారు. దీంతో ఆదివారం ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాలు కళకళలాడాయి. పర్యాటకుల తాకిడి భారీగా పెరగడంతో సందడి వాతావరణం నెలకొంది. అరకు, పాడేరు హెూటల్స్‌కి డిమాండ్ పెరిగింది. ఏజెన్సీకి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో రావడంతో ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా ఘాట్ రోడ్లలో పోలీసుల ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకున్నారు. మన్యంలోని ఆయా పర్యాటక ప్రాంతాల్లో చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జికె వీధి, సీలేరు, దేవి పట్టణం, చింతూరు, మోతుగూడెం ప్రాంతాల్లో సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో ఆదివారం రద్దీగా మారాయి.

ఆంధ్ర ఊటీగా పిలవబడే అరకులోయలో పరుచుకున్న మంచు తెరల దుప్పటి కొత్త అనుభవాన్ని పంచుతోంది. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు ప్రస్తుత వాతావరణంలో పొగ మంచు తాకిడిలో ప్రకృతి సోయగాలకు పర్యాటకులు ఉబ్బితబ్బిబవుతున్నారు. లంబసింగిలోని ప్రస్తుత వాతావరణం పరిస్థితిలో పర్యాటకులు కొత్త అనుభవాలను రుచి చూస్తున్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాలను చూసేందుకు పర్యాటకులు క్యూ కడుతున్నారు. ఇక్కడి సహజ అందాలతో సెల్ఫీలు దిగుతూ చెరగని గురుతులు సంపాదించు కుంటున్నారు. పర్యాటక ప్రాంతాలుగా ప్రకృతి అందాలకు విశ్వవ్యాప్తి పొందిన బొర్ర గుహలు, కటికి, తాటిగూడ జలపాతాలు, చాపరాయి జలవిహారి, కొత్తపల్లి జలపాతాలతో పాటు పాడేరు మండలంలోని వంజంగి హిల్స్‌లోని మేఘాల కొండపై మంచు అందాలు పర్యాటకులను ఎంతో ఆకర్షించాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల నుంచి వందలాది మంది పర్యాటకులు ఏజెన్సీకి చేరుకుని ఇక్కడ ప్రకృతి అందాలను వీక్షించారు. హుకుంపేట మండలంలోని పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రమైన మత్స్యగుండంకు కూడా పర్యటకులు సందర్శించారు.

డుంబ్రిగుడలోని చాపరాయి వద్ద పర్యాటకులు

డుంబ్రిగుడ: మండలంలోని స్థానిక పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో పర్యాటక కేంద్రం పర్యాటకులతో కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంలో సరదాగా స్నానాలు చేసి, ఆదివాసి గిరిజన సంప్రదాయమైన వేషధారణ ధరించి థింసా నృత్యాలు ప్రదర్శిస్తూ ఆనందంగా గడిపారు. జల పాతంలోని ఉద్యానవనంలో ఫోటోలు తీయించుకుంటూ సందడి చేశారు. రోడ్డు కిరివైపులనున్న వలిసే పూలతోటల్లో పోటోలు తీసుకుంటూ సరదాగా గడిపారు.చెట్టు నీడల్లో పర్యాటకులు వంటకాలు చేసుకుని వనభోజనాలు చేసి కుటుంబ సమేతంగా ఆటపాటలతో డ్యాన్స్ లు చేస్తూ ఆనందంగా గడిపారు.

బొర్రా గుహల వద్ద పర్యాటకులు

అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయలో భారీగా పర్యాటకులు భారీగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. అరకు -విశాఖ ఘాట్ రోడ్డులో అడుగడుగున ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో వాహన చోదకులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి చిక్కుకున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పర్యాటకులు వేల సంఖ్యలో తరలి రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. పర్యాటకుల రద్దీని దష్టిలో పెట్టుకున్న పోలీసులు విశాఖ వైపు నుంచి అరకు వస్తున్న వాహనాలకు అనుమతిస్తూ, అరకు నుంచి విశాఖ వెళ్తున్న వాహనాలకు పాడేరు మీదుగా వెళ్లాలని స్పష్టమైన ఆంక్షలు విధించారు. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో సందర్శిత ప్రాంతాలే కాకుండా, బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. అరకులోయ సమీపంలోని సుంకరమెట్ట కాఫీ తోటలోని వుడెన్ బ్రిడ్జిలో వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పర్యాటకులు కొంత ఊపిరి పీల్చుకున్నారు.గిరిజన సాంస్కృతిక మ్యూజియం, పద్మావతి విద్యానవన కేంద్రానికి ప్రవేశ ద్వారా ఆదాయం సమకూరింది.

అనంతగిరి: వివిధ పాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకులు ఆదివారం తరలి రావడంతో బొర్రా గుహలు సందడిగా మారాయి. అలాగే డముకు. యు పాయింట్, కటికి, తాటిగుడ, చిట్టంపాడు, అనంతగిరి, బీసుపురం, కాఫీ ప్లాంటేషన్, గాలికొండ యు పాయింట్, సుంకరమట్ట కాఫీ ప్లాంటేషన్ సందడిగా మారాయి. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జాంతో వాహనాలు నిలిచి పోయాయి. వాహనాలు ఎక్కడకక్కడ నిలిచి పోవడంతో స్థానిక పోలీసు, రెవిన్యూ యంత్రాంగం రంగంలోకి దిగి పర్యాటకులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పోలీసులు చర్యలు చేపట్టారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ తొట్టిపై కాలిపోతున్న వరి చేను

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వరిచేను దగ్ధం

ప్రజాశక్తి- వడ్డాది : వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగలడంతో ట్రాక్టర్‌పై తీసుకొస్తున్న వరిచేను దగ్ధమైన ఘటన ఆదివారం బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలో చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే వడ్డాది గ్రామానికి చెందిన బొబ్బలి రాజు అనే రైతు సాయిబాబా గుడి ఎదురుగా పంటపొలాల్లో నుండి వరి చేనును ట్రాక్టర్‌పై కట్టి పాక వద్దకు తీసుకువస్తుండగా, పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ట్రాక్టర్ తొట్టితో సహా వరి పనలు కాలిబూడిదయ్యాయి. దీంతో బాధిత రైతుల లబోదిబోమంటున్నాడు. కష్టపడి పండించిన పంట ఇలా అగ్నికి ఆహుతి కావడం, దీంతోపాటు ట్రాక్టర్ తొట్టి కూడా కాలిపోవడంతో దిగులు చెందుతున్నాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నాడు.

కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- పాడేరు టౌన్: ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి..దాదాపు 36 సంవత్సరాల క్రితం ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న వారందరూ ఒకటయ్యారు. చోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఒకే బడిలో కలిసిమెలిసి చదివారు. ఆడారు పాడారు. మళ్లీ ఆ జ్ఞాపకాలు పోగేసుకుందామని సంకల్పించారు. వివిధ వృత్తుల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలోని పర్యాటక ప్రాంతం మత్స్యగుండంలో ఒకే చోటకు చేరుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాల గురించి తెలుసుకుంటూ పులకరించిపోయారు. దాదాపు 40 మంది వరకు ఒకే దగ్గర చేరి వారి యోగ క్షేమాలు పంచుకున్నారు. వారు చదివిన తరగతిలో గురువుల మాటలు, తరగతి గది కబుర్లు గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆత్మీయతలు అనురాగాలు పంచుకుంటూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. కె.బ్రమ్మాజీ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ కార్యక్రమంలో డిటిలు పోలరాజు, రంగారావు, లక్ష్మణమూర్తి, జిల్లా విఆర్ ఒల సంఘం అధ్యక్షుడు రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

-సుంకర మెట్ట-కటికి వాటర్ ఫాల్స్ రోడ్డులో వరుస ప్రమాదాలు

- భయంతో ప్రయాణం చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండలం సుంకరమెట్ట నుంచి కటికి వాటర్ ఫాల్స్‌కు వెళ్లే రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో చుట్టుపక్కల గ్రామస్తులు, పర్యాటకులు తీవ్ర భయాందోళనతో ప్రయాణం చేస్తున్నారు. రోడ్డు అత్యంత దయనీయంగా మారడంతో ఎప్పుడేం జరుగు తుందోనన్న ఆందోళన నెలకొంది. పిరిబంద ఘాటీలో ఓ పర్యాటకుల కారు అదుపు తప్పి పల్టీలు కొట్టి బ్రిడ్జి కిందకు దొర్లిన ఘటన కలకలం రేపింది.ఈ ప్రమాదంలో కారులో ఉన్న పర్యాటకుడు గాయాలతో బయటపడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

2018-19 సంవత్సరంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద సుంకర మెట్ట నుంచి కటికి వాటర్ ఫాల్స్ వరకు 7 కిలోమీటర్ల పొడవున బీటీ రోడ్డును రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించారు. 2021లో రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో నిర్మాణం పూర్తైన రెండేళ్లకే రోడ్డు తీవ్రంగా దెబ్బతిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఒప్పందం ప్రకారం ఐదేళ్లపాటు మెయింటెనెన్స్ బాధ్యత ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్కసారి కూడా సరైన మరమ్మత్తులు చేపట్టలేదని స్థానికులు పేర్కొన్నారు.

ఈ సమస్యపై పాడేరు పబ్లిక్ గ్రీవెన్స్‌లో పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు తెలిపారు. ఫిర్యాదులు చేసిన ప్రతిసారి కాంట్రాక్టరు రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఫొటోలు తీసి వెళ్లి పోతున్నారని, పనులు పూర్తిచేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సుంకరమెట్ట నుంచి కటికి వాటర్ ఫాల్స్ వరకు పూర్తిగా దెబ్బతిన్న బీటీ రోడ్డును సంబంధిత కాంట్రాక్టరుతో వేగవంతంగా మరమ్మతులు చేయించాలని, చుట్టుపక్కల ఉన్న పీవీటీజీ గ్రామాలకు సురక్షిత రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోల్తా పడిన కారు

దేశాభివృద్ధిలో కాంగ్రెస్ పాత్ర మరువలేనిది

డిసిసి అధ్యక్షులు హాసిని వర్మ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : దేశ అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ పాత్ర మరువలేనిదని డిసిసి అధ్యక్షులు అడ్డాల వెంకటవర్మ రాజు (హాసిని వర్మ రాజు) తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ముందుగా కాంగ్రెస్ జెండాను హాసిని వర్మ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందంటే అది కాంగ్రెస్ పార్టీ వల్లేనని తెలిపారు. బ్రిటిష్ వారి పాలనలో మగ్గిపోతున్న తరుణంలో దేశ స్వాతంత్ర్యం కోసం అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పుట్టిందని తెలిపారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ భారత ప్రధానులుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, గ్రామాలలోని ప్రతి పేద ఇంటికి సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. 12 సంవత్సరాలుగా బిజెపి దేశంలో కులాలు, మతాల ప్రాతిపదికన పాలన సాగిస్తుందన్నారు. పేదల ఉపాధి కోసం ప్రారంభించిన ఉపాధి హామీ చట్టానికి మహాత్మా గాంధీ పేరును బిజెపి ప్రభుత్వం తొలగించి, ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పోరాటాలు కొనసాగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుత్తుల శ్రీనివాస్, రాష్ట్ర స్పోర్ట్ సెల్ చైర్మన్ కమలాకర్, సేవాదళ్ నాయకులు, నియోజక వర్గ ఇన్‌చార్జి లు,ప్రధాన కార్యదర్శులు,వార్డు ప్రెసిడెంట్లు ఎస్సీ సెల్ మైనారిటీ సెల్ నాయకులు, మహిళ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో క్రీడల అభివృద్ధికి తోడ్పాటు

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నగరంలో క్రీడల అభివృద్ధికి, యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను నిరంతరం ముందు ఉంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో వంగవీటి రంగా మెమరియల్ కిక్ బాక్సింగ్, ర్యాంబో సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో ఇటువంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

శ్రామిక ఉత్సవ్‌లో వీఎంఆర్‌డిఎ కమిషనర్ తేజ్‌భరత్ సందడి

ప్రజాశక్తి , ఎంవిపి కాలనీ: నగరంలో జరుగుతున్న సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన 'శ్రామిక ఉత్సవం' రెండో రోజు అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ ప్రదర్శనను విశాఖపట్నం మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్. తేజ్ భరత్ సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ విభాగాలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో రూపొందించిన లఘు చిత్రాన్ని కమిషనర్ తిలకించారు. చిత్ర యూనిట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సైన్స్ ఎగ్జిబిషన్, కార్టూన్ ఫోటో ఎగ్జిబిషన్లను పరిశీలించారు. కార్మికుల సమస్యలు, చారిత్రక ఘట్టాలను ప్రతిబింబించేలా ఉన్న ఫోటోలు, కార్టూన్ల గురించి అక్కడి నిర్వాహకులను అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. కార్మికవర్గాల చైతన్యం కోసం, అలాగే విజ్ఞానాన్ని పెంపొందించేలా ఇటువంటి వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను కమిషనర్ ప్రశంసించారు. ఈ ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

రహదారులు ఇలా..ప్రయాణం ఎలా..?

ఆముదల బంద వెళ్లే రహదారి

రాళ్లు తేలిన కొమరవరం రహదారి

ప్రజాశక్తి - గంగవరం: ప్రధాన రోడ్ల నుంచి గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. గంగవరం మండలంలో కుసుమ రాయ, కొమరవరం, ఆముదలబంద, చీడిపాలెం, గొరగొమ్మి రహదారులు మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిస్థితి మారడం లేదని వారు అంటున్నారు. ఆముదలబంద, కొమరవరం రహదారి మంజూరైంది. కానీ ఇప్పటివరకు సరైన రోడ్డు వేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలనిని గ్రామస్తులు కోరుతున్నారు.

నూతన సంవత్సరం సందర్భంగా

మద్యం అమ్మకాలను నియంత్రించాలి

బార్లు, క్లబ్‌లు, పబ్బులపై పోలీసులు నిఘా పెట్టాలి

ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవి, సత్యవతి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈనెల 30 నుంచి జనవరి 1వ తేదీ వరకు మద్యం అమ్మకాలు రాత్రి 7 గంటల వరకే జరిగేలా నిర్ణయం తీసుకోవాలని, మద్యం అమ్మకాలను నియంత్రించాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులను ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి డిమాండ్ చేశారు. జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన ఐద్వా జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. డిసెంబర్ 31, జనవరి 1 తేదీలలో మద్యం దుకాణాలు తెల్లవార్లు తీసి ఉంచడం వల్ల యువత మద్యం అధికంగా సేవించి రోడ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, ప్రజలకు ముఖ్యంగా మహిళలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తుండటం, రోడ్లపై ప్రమాదాలకు గురై కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. యువత తాగిన మైకంలో దాడులు, గొడవలకు పాల్పడటం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, అఘాయిత్యాలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతుందని, అడుగడుక్కి బార్లకు లైసెన్సులు ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అండతో మద్యం షాపుల యజమానులు ఏమాత్రం నిబంధనలు పాటించడకుండా, రోజుకి 24 గంటలు విచ్చల విడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. మద్యాన్ని నిషేధించాలని మహిళలు పోరాడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ తీసుకొచ్చి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ఆరోపించారు. కాలేజీలు, స్కూల్స్, హాస్టల్స్‌ను టార్గెట్ చేసుకుని మత్తు పదార్థాలు అమ్మకాలు సాగిస్తుండడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని విమర్శించారు. విశాఖ నగరానికి నూతన సంవత్సరం సందర్భంగా టూరిస్టులు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు కనుక డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీలలో మద్యం అమ్మకాలను నియంత్రించాలని, మద్యం షాపుల సమయాలను సవరించి రాత్రి 7 గంటల తర్వాత మద్యం విక్రయాలు నిలిపివేయాలని కోరారు. క్లబ్బులు పబ్బులు, బార్లపై పోలీసుల నియంత్రణ ఉండాలని, ఎక్కడికక్కడ పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఐద్వా నాయకురాలు బి.పద్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవి, సత్యవతి

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్ : కలెక్టర్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యలు పరిస్కారానికి ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇకనుండి రెవెన్యూకు సంబంధించిన అర్జీలు విషయమై 'రెవిన్యూ క్లినిక్'ను కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఒక్కరోజు మాత్రమే కాకుండా, ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉంటుందన్నారు. సదరు కార్యక్రమానికి జిల్లాలోని అందరు రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దారులు పాల్గొంటారని, కావున అర్జీదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కెజిహెచ్‌లో విద్యుత్ కోతల నివారణకు చర్యలు'

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)లో విద్యుత్ కోతల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ఈ క్రమంలోనే తాజాగా 323 కెవి మొబైల్ జనరేటర్‌ను (ట్రాలీ జనరేటర్) అందుబాటులోనికి తీసుకొస్తున్నామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. తన ఛాంబర్‌లో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ రెండు నెలల క్రితం కెజిహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ వద్ద చేపడుతున్న అభివృద్ధి పనుల సమయంలో పైపులైన్ పగిలి విద్యుత్ కోత నిలిచిపోయిన కారణంగా రోగులు ఇబ్బంది పడ్డారని, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రాజేంద్రప్రసాద్, భావనగర్ వార్డులకు నూతన జనరేటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే సిఎస్ఆర్ బ్లాక్‌లో సోలార్ ద్వారా విద్యుత్ అందుతుండగా, కెజిహెచ్‌లో మొత్తం 10 జనరేటర్లు ఉన్నాయని చెప్పారు. ఇవే కాకుండా 323 కెవి సామర్థ్యం గల 3 మొబైల్ జనరేటర్ల (ట్రాలీ జనరేటర్) బ్యాక్ అప్ కోసం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిహారిక

ఫరెవర్ మిస్ ఇండియాగా నిహారిక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రాజస్థాన్‌లోని జైపూర్ జీ స్టూడియోస్‌లో నిర్వహించిన ఫరెవర్ స్టార్ ఇండియా అవార్డ్స్ గ్రాండ్ ఫినాలేలో నీహారిక బెతనపల్లి 'ఫరెవర్ మిస్ ఇండియా 2025' విజేతగా నిలిచారు. ఫరెవర్ స్టార్ ఇండియా సిఇఒ రాజేష్ అగర్వాల్, డైరెక్టర్ జయచౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఆమె ఈ కిరీటాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తానూ విశాఖపట్నంలో పుట్టి పెరిగానని, బి.టెక్ పూర్తి చేసి, గత మూడేళ్లుగా బెంగళూరులోని ఒక టెక్నికల్ సంస్థలో పనిచేస్తున్నానని తెలిపారు. జాతీయస్థాయి కిరీటాన్ని గెలవడానికి ముందు 'మిస్ బెంగుళూరు' టైటిల్‌ను కూడా సాధించినట్లు చెప్పారు. ఈ జాతీయ స్థాయి పోటీ కోసం దేశవ్యాప్తంగా సుమారు 10,000 నామినేషన్లు రాగా, ఫినాలేకు 105 మంది ఎంపికైనట్లు తెలిపారు. అందం అంటే కేవలం ప్రదర్శన మాత్రమే కాదని, ఆత్మవిశ్వాసం, సానుభూతి సమాజం పట్ల అవగాహన కలిగి ఉండటమే నిజమైన అందమని ఈ సందర్భంగా నీహారిక పేర్కొన్నారు. అంతేకాకుండా కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతంలో తొమ్మిదేళ్లకు పైగా శిక్షణ పొందానని, 2008, 2011 సంవత్సరాల్లో జరిగిన మహాబృంద నాట్యం గిన్నిస్‌వరల్డ్ రికార్డ్ కూచిపూడి ప్రదర్శనల్లో పాల్గొన్నానని తెలిపారు. అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్, హైజంప్ డిస్కస్ త్రో విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించానన్నారు.

ఇంటర్మీడియట్ ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఇంటర్మీడియట్ ఉద్యోగుల సేవా సంఘం విశాఖ జిల్లా 2026 కేలెండరును ఆదివారం పిఠాపురం కాలనీ ప్రాంతీయ పర్యవేక్షణ కార్యాలయంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి సుధాకర్ మాట్లాడుతూ కళాశాలల్లో కార్యాలయపు పని తీరును మెరుగుపరచాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు జివి.అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా వున్న జిల్లా పర్యవేక్షకులు పోస్టుల భర్తీ, పదోన్నతులపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంచాలకులు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాల్లోని కళాశాలల్లో పదోన్నతులపై భర్తీ చేయాల్సిన పోస్టులపై రాష్ట్ర సంఘం ఉన్నతాధికారుల దృష్టిలో తీసుకెళ్లినట్లు తెలిపారు.